వెండితెరను చెక్కిన మానవీయ శిల్పం

శ్యామ్‌బెనగల్ మరణం తీరనిలోటు • బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): భారతీయ సినీ దర్శక దిగ్గజం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మభూషణ్ శ్యామ్‌బెనగల్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంతాపం ప్రకటించారు. విస్మరించబడిన మనుషుల సామాజిక నేపథ్యాలకు సినిమా రంగంలో సమాంతర స్థానం కల్పించి, సామాన్యుల జీవన ఇతివృత్తాలను ఎంచుకొని వెండితెరకే వెలుగులద్దేలా గౌరవం కల్పించిన గొప్ప దర్శకుడు, భరతమాత కన్న తెలంగాణ ముద్దుబిడ్డ శ్యామ్ బెనగల్ అని కేసీఆర్ కొనియాడారు. ఇటు తెలంగాణ జీవన నేపథ్యాన్ని, అటు దేశీయ సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని ఇరుసుగా చేసుకుని, ఆలోచింపచేసేవిధంగా దృశ్యమానం చేస్తూ, డాక్యుమెంటరీలు, సినిమాల రూపంలో అయన సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. హైదరాబాద్ గడ్డ మీద పుట్టిన బిడ్డగా చలనచిత్ర రంగంలో తన కృషితో ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించి, భారతీయ సినిమాకు వన్నె తెచ్చిన శ్యామ్‌బెనెగల్ తెలంగాణకు గర్వకారణం అని పేర్కొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): క్రీస్తు పుట్టినరోజును పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు బోధనలు, కార్యాచరణ ప్రపంచ మానవాళిని ఎంతగానో ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. ఏ నేరమూ చేయని తనను శిలువకు ఎక్కిస్తున్న పాషాణ హృదయులను కూడా క్షమించాలని ప్రభువును వేడుకున్న మహాత్యాగశీలి, అహింసావాది యేసు క్రీస్తు అని కేసీఆర్ కొనియాడారు. పాపులను సైతం క్షమించే ఓర్పు, సహనం, దార్శనికత మానవ సమాజానికి క్రీస్తు చూపిన అత్యద్భుతమైన శాంతిమార్గమని తెలిపారు. విశ్వశాంతిని కాంక్షించే పరోపకారులైన ప్రతి ఒక్కరికీ యేసు బోధనలు అనుసరణీయమని, ద్వేషంతో నిండిపోతూ రోజురోజుకూ స్వార్థపూరితమవుతున్న మానవ సంబంధాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు క్రీస్తు కార్యాచరణ మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గంగా-జమున సంస్కృతి పరిఢవిల్లేలా, మత సామరస్యం వెల్లివిరిసేలా సర్వ మత హితాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరించి చూపిందని వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రిస్టియన్ మైనారిటీలకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దేశానికే ఆదర్శంగా అమలుచేశామని పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో వైభవోపేతంగా నిర్వహించిందని గుర్తుచేశారు.

లోకం పోకడ

హుర్రే.. డిసెంబర్ 31కి ఓ బార్‌కు కన్నంవేసి తెల్లవార్లు పార్టీ చేసుకొని ఈ ఏడాదికి వీడ్కోలు పలుకుదాం!

అన్నదాత ఆగం

- ధాన్యం ఉత్పత్తి 1.53 కోట్ల టన్నులు.. సర్కార్ కొన్నది 46 లక్షల టన్నులు
- ఎగ్గొట్టిన రైతు భరోసా 26 వేల కోట్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం తీరు కొన్నది కాకరకాయ.. కొసిరింది గుమ్మడికాయ అన్నట్టుగా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. వానకాలం సీజన్‌లో రాష్ట్రంలో 1.53 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే.. ఇప్పటివరకు ప్రభుత్వం కొన్నది 46 లక్షల టన్నులు మాత్రమేనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రైతుభరోసా కింద ఎకరానికి ఏడాదికి రూ.15 వేల ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. గత వానాకాలం, యాసంగి సీజన్లకు కలిపి రూ.26 వేల కోట్లు ఎగ్గొట్టిందని విమర్శించారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి రైతుల్లో ఆశలు రేపి, చివరకు దొడ్డు వడ్లకు తెడ్డు చూపి, సన్న వడ్లకు సవాలక్ష కొర్రీలు పెట్టి రూ.530 కోట్లతో సరిపెట్టిందని ధ్వజమెత్తారు. అసలు రైతుకే భరోసా లేదు.. ఇక కౌలురైతులు, రైతుకూలీల ఊసెక్కడిదని ఆవేదన వ్యక్తంచేశారు. కల్లాల వద్దనే కొనుగోళ్లు చేసి కేసీఆర్ ప్రభుత్వం రైతుకు భరోసా కల్పిస్తే.. కల్లోల కాంగ్రెస్ పాలనలో మాత్రం అన్నదాత ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

శ్యామ్ బెనగల్ భావితరాలకు స్ఫూర్తి

లెజెండరీ ఫిల్మ్‌మేకర్ శ్యామ్‌బెనగల్ మరణంపై కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. శ్యామ్‌బెనగల్ జీవితం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. ఆయన తొలి చిత్రం అంకుర్‌తో తెలంగాణ సామాజిక జీవనాన్ని కండ్లకు కట్టారని అన్నారు. ఆయన మరణం సినీలోకానికి తీరని లోటని పేర్కొన్నారు.

ఎగవేసిన బోనస్ 1561 కోట్లు

ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్న సన్నాల లక్ష్యం 50 లక్షల టన్నులు • తద్వారా రైతులకు అందే బోనస్ 2,500 కోట్లు

- కొనుగోలు చేసింది 18 లక్షల టన్నులు
- రైతులకే అందేది రూ.939 కోట్లే..
- ఇందులోనూ 348 కోట్లు బకాయి
- ఈ లెక్కన సన్న రైతులకు సర్కారు ఎగ్గొట్టిన బోనస్ రూ.1561 కోట్లు
- ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు
- 30% కూడా కొనుగోలు చేయని సర్కారు

హైదరాబాద్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ బోగస్ అయింది. సన్నాలు సాగు చేస్తే బోనస్ వస్తదని ఆశపడిన రైతులకు సర్కారు సున్నం పెట్టింది. తద్వారా సన్నధాన్యం పండించిన రైతులకు సర్కారు ఎగ్గొట్టిన బోనస్ అక్షరాలా రూ.1,561 కోట్లు! వానకాలం సీజన్‌లో 50 లక్షల టన్నుల సన్నాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ, కొనుగోలు చేసింది కేవలం 18.78 లక్షల టన్నులే. ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా 50 లక్షల టన్నుల సన్నాలు కొనుగోలు చేసి ఉంటే, రైతులకు బోనస్ కింద రూ.2,500 కోట్లు అందేవి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం 18.78 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయడంతో సన్నాలు అమ్మిన రైతులందరికీ ప్రభుత్వం అందించే బోనస్ కింద రూ.939 కోట్లు మాత్రమే అందనున్నాయి. ప్రభుత్వం సన్నాల లక్ష్యంలో 31.22 లక్షల టన్నులు తక్కువగా కొనుగోలు చేసింది. దీంతో రైతులు ప్రభుత్వం నుంచి పొందాల్సిన రూ.1,561 కోట్ల బోనస్‌ను కోల్పోయారు. కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి బోనస్‌గా ఇవ్వాల్సిన రూ.939 కోట్లలో ఇప్పటివరకు రూ.591 కోట్లు చెల్లించిన ప్రభుత్వం మరో రూ.348 కోట్లు బకాయి పెట్టింది.

సన్నాల కొనుగోలులో నిర్లక్ష్యం

రైతుల నుంచి సన్న ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిందనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి అక్టోబర్ 1వ తేదీన ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో అంతులేని జాప్యం ప్రదర్శించింది. దీంతో చాలామంది రైతులు సన్న ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు సన్నాలన్నీ ప్రైవేట్‌కు వెళ్లిపోయిన తరువాత ప్రభుత్వం కేంద్రాల్లో కొనుగోళ్లలో వేగం పెంచింది. ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచే ప్రాణాళిక ప్రకారం ప్రచారం చేసి సన్నాలు కొనుగోలు చేస్తే రైతులకు ఎంతో మేలు జరిగేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్పత్తి 156 లక్షల టన్నులు.. కొన్నది 47 లక్షలే

ఈ వానకాలం సీజన్‌లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 66.78 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైందని, తద్వారా గతంలో ఎప్పుడూ లేని విధంగా 156 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నది. రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపింది. కానీ, ఈ సీజన్‌లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం 47 లక్షల టన్నులు మాత్రమే. మొత్తం ఉత్పత్తిలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం 30 శాతం మాత్రమే కావడం గమనార్హం. ఈ లెక్కన ప్రభుత్వం ఇంకా 109 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వదిలేసింది. ఇందులో సుమారు 10-15 లక్షల టన్నుల ధాన్యం రైతులు తమ అవసరాలకు ఉంచుకున్నా.. ఇంకా 94 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయకపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయని ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించుకున్నారు. మద్దతు ధర దక్క పోయినా క్వింటాల్ ఒక్కంటికి రూ.300-400 నష్ట పోయి అమ్ముకున్నారు. ప్రభుత్వం పక్కాగా కొనుగోళ్లు చేసి ఉంటే కనీసం 80-90 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అల్పపీడనం ఎఫెక్ట్.. రాష్ట్రంలో 3 రోజులు వర్షాలు!

ఏపీలోనూ వానలు • అప్రమత్తమైన రైల్వే

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజులపాటు మోస్తారు వర్షాలు కురువొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఏపీలోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడొచ్చని పేర్కొంది. దీంతో ఏపీలోని కళింగపట్నం, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం, తమిళనాడులోని పలు పోర్టుల్లో మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మరోవైపు వర్షాలు పడొచ్చన్న హెచ్చరిక నేపథ్యంలో రైల్వే శాఖ అప్రమత్తమైంది. ఉన్నతాధికారులతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సమీక్ష నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

21న కేఆర్ఎంబీ మీటింగ్

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశం వచ్చే నెల 21న జరుగనున్నది. ఈ నెల 3న నిర్వహించాల్సి ఉన్నప్పటికీ రెండు రాష్ట్రాల అభ్యంతరాలతో వాయిదా పడింది. జనవరి 21న సమావేశాన్ని నిర్వహించనున్నట్టు కేఆర్ఎంబీ సోమవారం రెండు రాష్ట్రాలకు లేఖ రాసింది. మీటింగ్ ఎజెండా కూడా ఖరారు చేసింది. తెలంగాణ తరపున 13 అంశాలు, ఏపీ తరపున ఐదు అంశాలను ఎజెండాలో చేర్చారు. కృష్ణా బేసిన్‌లో ఏపీ కడుతున్న అక్రమ ప్రాజెక్టులను ఆపడంపై బోర్డు మీటింగ్‌లో చర్చించాలని తెలంగాణ కోరింది. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ఆధునికీకరణకు అనుమతించాలని, సాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ బాధ్యతలను తెలంగాణకు అప్పగించాలనే పలు అంశాలను ఎజెండాలో రాష్ట్ర అధికారులు పేర్కొన్నారు.

ప్రాజెక్టుల్లో పూడికతీతకు శ్రీకారం

టెండర్లకు ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జలాశయాల్లో పూడికతీత ద్వారా ఆదాయం రాబట్టుకోవడంతోపాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టు కింద మూడు ప్రాజెక్టులను ఎంపిక చేసింది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్య మానేరు, కరీంనగర్ జిల్లాలోని దిగువ మానేరు జలాశయాల నుంచి పూడికను వెలికితీసే ప్రక్రియను షురూ చేసింది. దీనికోసం టెండర్లు నిర్వహించి గుత్తేదారులకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. మంగళవారం టెండర్ల కోసం ఉత్తర్వులు జారీ చేసింది.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ సర్పంచులు

స్థానిక ఎన్నికలను అడ్డుకుంటాం

పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే

మాజీ సర్పంచుల జేఏసీ హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్‌పేట్: పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని మాజీ సర్పంచుల జేఏసీ డిమాండ్ చేసింది. బిల్లులు చెల్లించకుండా మాజీ సర్పంచుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 27న గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేయనున్నట్టు వెల్లడించింది. నిరసనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సికింద్రాబాద్ గాంధీ దవాఖాన వద్ద జేఏసీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను చెల్లించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు తమ సమస్యలను ప్రస్తావిస్తే అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవహేళన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య నిర్మాణం కోసం తాము కష్టపడి పనిచేశామని, అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేశామని వెల్లడించారు. కానీ కాంగ్రెస్ సర్కార్ మాత్రం పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందిపెడుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల జేఏసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగయ్య, గణేశ్, మల్లయ్య, పూర్ణచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తగిన పరిహారమిస్తాం

ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు సహకరించండి • అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

అనంతవరం ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, డిసెంబర్ 24 : ఉమామహేశ్వర రిజర్వాయర్‌కు సహకరిస్తే రైతులకు తగిన పరిహారమిస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని క్యాంప్ కార్యాలయంలో అనంతవరం రైతులు, నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కోరారు. తులకు పరిహారమిచ్చి ఆదుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం అచ్చంపేట మండలం మార్లపాడులో నక్కలగండి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సభలో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. తమ డిమాండ్లకు ప్రభుత్వం సానుకులంగా స్పందిస్తేనే పరిహారం, పునరావాసానికి ఒప్పుకుంటామని నిర్వాసితులు తేల్చి చెప్పారు.

కేథార్‌పూర్‌లో ఆరుగురికే రుణమాఫీ

ఆదిలాబాద్ జిల్లాలో మాఫీ కానివారెందరో.. ఎదురుచూసి ఆశలు వదులుకున్న అన్నదాతలు

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కేథార్‌పూర్‌లో రుణమాఫీ వర్తించని రైతులు

ఆదిలాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ ఆదిలాబాద్ జిల్లాలో ప్రహసనంగా మారింది. జిల్లాలో 90 వేల మంది రైతులకు బ్యాంకు ఖాతాలు ఉండగా నాలుగు విడతల్లో 62,298 మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. మూడో విడతలో 55,600 మంది రైతులకు రుణమాఫీ చేయగా వివిధ కారణాల వల్ల చాలామంది రైతులు రూ.2 లక్షల రుణమాఫీకి దూరమయ్యారు. రైతుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పలు కారణాలతో రుణమాఫీ కాలేదని తెలిపింది. రేషన్‌కార్డు లేని వారు, కుటుంబాల నిర్ధారణ కానివారు, ఆధార్‌కార్డుల్లో పొరపాట్లు, బ్యాంకు ఖాతాల్లో తప్పులను సవరించడానికి సర్వే చేపట్టారు. సర్వేలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతుల ఇండ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబాలతో సెల్ఫీలు దిగి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. జిల్లావ్యాప్తంగా 18 వేల మంది కుటుంబ నిర్ధారణ కాలేదని గుర్తించారు.

కేథార్‌పూర్‌లో విచిత్ర పరిస్థితి

జైనథ్ మండలంలోని కేథార్‌పూర్‌కు చెందిన 90 మంది రైతులు గిమ్మ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌లో రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.2 లక్షల లోపు బ్యాంక్ లోన్ ఉన్న రైతులు 50 మంది ఉంటారు. ప్రభుత్వం నాలుగు విడతలుగా 2 లక్షల రుణమాఫీ ప్రకటించగా.. ఈ గ్రామంలో కేవలం ఆరుగురికి మాత్రమే మాఫీ వర్తించింది. ఇందులో ఇద్దరు రైతులు రూ.1.20 లక్షలు బాకీ ఉంటే రూ.80 వేల చొప్పున అరకొర మాఫీ జరిగింది. నాలుగో విడతలో మరో ముగ్గురికి మాఫీ చేసినట్టు ప్రకటించినా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు ఇంకా జమకాలేదు. అధికారుల చుట్టూ తిరిగి వేసారిన రైతులు రుణమాఫీపై ఆశలు వదులుకున్నారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో రుణమాఫీ పరిస్థితి ఇలాగే ఉన్నది.

85 వేలు మాఫీ కాలేదు

నాకు ఎకరంన్నర భూమి ఉన్నది. పత్తి వేసిన. జైనథ్ మండలం గిమ్మలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 85 వేలు లోన్ తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 2 లక్షల రుణమాఫీ నాకు వర్తించలేదు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే దరఖాస్తు ఇస్తే చేస్తమన్నారు. మూడుసార్లు దరఖాస్తు ఇచ్చినా ఫలితం లేదు. నాలుగు నెలల నుంచి బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేక పోవడంతో మాఫీ ఆశలు వదులుకున్నా.

– రవీందర్, రైతు, కేథార్‌పూర్, జైనథ్ మండలం

నాలుగు నెలలుగా తిరుగుతున్నం

నాకు రెండెకరాల భూమి ఉన్నది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ. లక్ష క్రాప్‌లోన్ తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీలో నా లోన్ మాఫీ కాలేదు. నాలుగు నెలల నుంచి బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. లిస్ట్‌లో మీ పేరు లేదు. మేమేమీ చేయలేమని బ్యాంకు అధికారులు అంటున్నారు. నిబంధనల ప్రకారం మీకు లోన్ మాఫీ కాదని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

– సంతోష్, రైతు, కేథార్‌పూర్, జైనథ్ మండలం, ఆదిలాబాద్

సోలార్ కంపెనీపై రైతుల వార్

- ఎస్సారెస్పీ కాలువ కబ్జాపై ఆగ్రహం
- నీళ్లురాక పంటలు ఎండుతున్నాయని ఆవేదన
- పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం
- పోతారంలో కంపెనీ ఎదుట అన్నదాతల ధర్నా

మంథని మండలం పోతారంలోని సోలార్ కంపెనీ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

మంథని రూరల్, డిసెంబర్ 24: తమ పొలాలకు నీరందించే ఎస్సారెస్పీ సబ్ కెనాల్‌ను పూర్వాంచ సోలార్ కంపెనీ యాజమాన్యం కబ్జా చేసిందని, వెంటనే కాలువను పునరుద్ధరించాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం రైతులు మంగళవారం సోలార్ కంపెనీ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలోని తమ పొలాలకు ఎస్సారెస్పీ ఎల్-6 సబ్ కాలువ కింద 70 ఎకరాల ఆయకట్టు ఉందని చెప్పారు. సోలార్ కంపెనీ యాజమాన్యం కెనాల్‌లో పైపులు వేసి, మట్టి కప్పేయడంతో నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. కంపెనీ యాజమాన్యం, అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైకోర్టుకు వెళ్లినట్టు గుర్తుచేశారు. ఆరు వారాల్లో పొలాలకు నీరందించాలని కోర్టు తీర్పునిచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాలువ పునరుద్ధరించాలని కోరితే సోలార్ కంపెనీ యాజమాన్యం తమపై దాడులు చేసేందుకు యత్నిస్తున్నదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని సంజీవ్ అనే రైతు పురుగులమందు తాగేందుకు యత్నించగా, అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. మరో మహిళా రైతు ఏఎస్ఐ కాళ్లు పట్టుకొని తమకు న్యాయం చేయాలని వేడుకుంది. కబ్జాకు గురైన కాలువను పోలీసులు రైతులతో వెళ్లి పరిశీలించారు. ఎస్సారెస్పీ డీఈ రాజేందర్‌తో ఏఎస్ఐ ఫోన్లో మాట్లాడగా సోలార్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినా స్పందించడంలేదని డీఈ చెప్పారు. 20రోజుల్లో కాలువను శుభ్రం చేస్తామని సోలార్ కంపెనీ సైట్ ఇన్‌చార్జి తెలిపారు.

రైతు సంజీవ్ పురుగుల మందును నోట్లో పోసుకుంటుండగా అడ్డుకుంటున్న పోలీసులు

రైతులను పట్టించుకున్నోడే లేడు..

ఈ ప్రభుత్వంలో రైతులను పట్టించుకున్నోడో లేడు. మా ప్రాణం పోయినా సరే కబ్జాకు గురైన కాలువను పునరుద్ధరించుకుంటాం. హైకోర్టు రైతులకు అనుకూలంగా తీర్పునిచ్చినప్పటికీ సోలార్ కంపెనీ యాజమాన్యం, అధికారులు పట్టించుకోవడంలేదు. గతంలో కాలువ వెంట 12 ఫీట్ల తొవ్వ ఉండేది. ఇప్పుడు అది లేదు. పొలాలకు వెళ్లాలంటే భయంగా ఉంది. వెంటనే కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి. లేదంటే మళ్లీ కోర్టుకు వెళ్తాం.

– యువ రైతు, బుద్ధార్థి సంజీవ్

కాళ్లు మొక్కుతా.. మాకు న్యాయం చేయండి.

మీ కాళ్లు మొక్కుతా సార్, మాకు న్యాయం చేయండి. ఎన్నో ఏండ్లుగా ఎవుసం చేసుకొని బతుకుతున్నం. నీళ్లు లేక పంటలు ఎండుతున్నయ్. పంటకు నీళ్లు వస్తనే మాకు బతుకు. లేదంటే చావే గతి. సోలార్ కంపెనీ వాళ్లు మమ్ముల బతుకనిత్తలేరు. మా భుములకు నీళ్లు రాకుండా చేస్తండ్లు. కోర్టు రైతులకు న్యాయం చేయాలని చెప్పినా వినిపించుకుంటలేరు. ఇప్పటికే చాలా నష్టపోయినం. ఇక మాకు ఓపిక లేదు. న్యాయం చేయకపోతే పురుగుల మందు తాగుతం.

– పుష్పలత, మహిళా రైతు, పోతారం

నాంపల్లిలోని పీడీపీపీ ప్రత్యేక కోర్టుకు హాజరైన లగచర్ల రైతులు..

కోర్టుకు పట్నం సహా లగచర్ల రైతులు

- వచ్చే మార్చి 28కి విచారణ వాయిదా
- ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఉత్తర్వులు
- సురేశ్ బెయిల్ పిటిషన్‌పై 27న వాదనలు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు మరో 23 మంది లగచర్ల రైతులు మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని ప్రత్యేక (పీడీపీపీ) కోర్టు ఎదుట హాజరయ్యారు. హత్యాయత్నంతోపాటు పీడీపీపీ సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో రైతులు ఇటీవలే బెయిల్‌పై విడుదలైన వారంతా ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చట్టం కింద నమోదైన కేసులో కోర్టుకు హాజరయ్యారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం భూములను గుంజుకునేందుకు యత్నించిన క్రమంలో రైతులు తిరగబడటంతో వారిపై వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట పోలీసులు కేసులు నమోదు చేశారు. నాంపల్లిలోని ఇన్‌చార్జి ఏసీబీ కోర్టు జడ్జి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ విచారణను మార్చి 28కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. లగచర్ల ఘటన కేసులో ఏ2 నిందితుడైన సురేశ్ తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పీడీపీపీ కోర్టు జడ్జి ఆదేశాలను జారీచేశారు. వాదనల కోసం విచారణను 27కు కోర్టు వాయిదా వేసింది. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితుల తరపున రెండో బెయిల్ పిటిషన్‌ను కోర్టుకు దాఖలు చేశారు.

పాల బిల్లుల బకాయిలు

చెల్లించండి

విజయ డైరీకి రైతు సంఘం లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): పాల బిల్లుల బకాయిలు చెల్లించాలని విజయ పాడి రైతులు డిమాండ్ చేశారు. గతంలో ప్రతి పదిహేను రోజులకోసారి బిల్లులు చెల్లించేవారని, ఇప్పుడు సకాలంలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పాడి రైతుల పరిరక్షక సంఘం అధ్యక్షుడు సాదం రమేశ్ విజయ డైరీ ఎండీకి లేఖ రాస్తూ 'బిల్లులు రాక పాడి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు దానా కూడా కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికీ 3 బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వెంటనే బకాయిలను విడుదల చేయండి. గతంలో మాదిరిగా 15 రోజులకోసారి బిల్లులు చెల్లించే